దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

- యూసీడీ ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన
- ఎంటమాలజీ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన

బాలానగర్, జూలై 18 : దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యూసీడీ ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లిలో ఇంటింటికీ తిరిగి దోమ కాటు-దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. దోమకాటు వల్ల వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యర్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లిలో..

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో అసిస్టెంట్ ఎంటమాలజీ నేతృత్వంలో దోమల వ్యాప్తిచెందకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. హైటెక్ మోడల్ స్కూల్‌తో పాటు పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మూసాపేట : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని మూసాపేట సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంద్రసేన అన్నారు. మూసాపేట డివిజన్ పరిధిలో కాలనీలు, బస్తీల్లో పీఓ ఇంద్రసేన, సీఓ కిరణ్ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, పైలేరియా వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఓ ఇంద్రసేన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు. పూలకుండీలు, టైర్లు, డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్య సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు.

కూకట్‌పల్లిలో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ పీఓ ఇంద్రసేన

దోమల నివారణపై ఓల్డ్‌బోయిన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

మూసాపేటలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూకట్‌పల్లిలో పోలీసుల తనిఖీలు

మూసాపేట, జూలై 18: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తప్పవని కూకట్‌పల్లి సీఐ కె.ముత్తు హెచ్చరించారు. బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ ముత్తు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విజబుల్ పోలిసింగ్, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్, ఈవ్ టీజింగ్ వాటిపై పోలీసులు మూడు బృందలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 18: అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన ఐదు అక్రమ నిర్మాణాలను గురువారం కూల్చివేయించారు. కార్యక్రమంలో అధికారులు కావ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు


ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న డీ. మస్తాన్‌రెడ్డి

అల్లాపూర్, జూలై 18 : డివిజన్‌లోని శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి రెండో రోజు నామినేషన్లు కొనసాగుతున్నాయి. గురువారం దేవరింటి మస్తాన్‌రెడ్డి తన మద్దతు దారులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి ఎన్నికల అధికారి సామ కొండల్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో మోయినుద్దీన్, కనకయ్య ముదిరాజ్, రవి ముదిరాజ్, ఆదినారాయణ, కృష్ణమూర్తి, చెలయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

బాలానగర్, జూలై 18 : ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం పలువురు ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నేత రాజశేఖర్‌తో కలిసి కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన్ను కలిసి తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో గురువారం చైతలి మజీ 'డివైన్ ఎరా అండ్ ఇన్నర్ వాయిస్' పేరిట చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ స్మితా సబర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మితో కలిసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన విభిన్న రకాల చిత్రాల వివరాలను చిత్రకారిణి చైతలి మజీని అడిగి తెలుసుకున్నారు. చిత్ర ప్రదర్శన ఈనెల 21 వరకు కొనసాగుతుందని, మొత్తం 47 చిత్రాలు ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ.రమణ రెడ్డి పాల్గొన్నారు.

– కొండాపూర్, జూలై 18

రోడ్డుపై ఆగిపోయిన వాటర్‌ట్యాంకర్

- రెండు గంటలపాటు వాహనదారుల ఇక్కట్లు

బాచుపల్లి-నిజాంపేట్ ప్రధాన రాహదారిపై నిలిచిపోయిన వాటర్‌ట్యాంకర్

దుండిగల్, జూలై 18 : వాటర్‌ట్యాంకర్ రోడ్డుపై అడ్డంగా ఆగిపోవడంతో రెండు గంటల ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి-నిజాంపేట్ ప్రధాన రాహదారిపై జలమండలి వాటర్‌ట్యాంక్ ఎదుట జరిగింది. వాటర్‌ట్యాంకర్ యూటర్న్ తీసుకుంటుండగా సాంకేతిక సమస్యతో రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయింది. దాంతో రోడ్డు ఒక వైపు పూర్తిగా మూసివేసినట్లయింది. ఈ విధంగా వాటర్ ట్యాంకర్ సుమారు రెండు గంటల పాటు నిలిచిపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మరమ్మతులు చేపట్టడంతో వాటర్ ట్యాంకర్ కదిలింది. దాంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొంపల్లి పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్, జూలై 18 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గురువారం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ రత్నావత్ గంగయ్యతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఐదో వార్డు బొల్లారం రోడ్డులో రూ. 35 లక్షలతో సింగిల్ ఆర్మ్ లైట్స్, 6వ వార్డు నూజివీడు రోడ్డులో రూ. 30 లక్షలతో ఆర్మ్‌లైట్స్, 8వ వార్డులో రూ.38 లక్షలతో సీసీ రోడ్డు, దూలపల్లి 16వ వార్డులో రూ.46 లక్షలతో ఓపెన్‌నాలా పనులు, కుమ్మరి చెరువు వద్ద రూ.45 లక్షల నిధులతో ఐదు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. పనులను త్వరగా పూర్తి చేయిస్తానన్నారు.

కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు డప్పు కిరణ్‌కుమార్, శ్రీవిద్యాప్రశాంత్ గౌడ్, వసంతాలక్ష్మణ్, రజినీజీవన్‌రెడ్డి, కృష్ణవేణీవినోద్, లక్ష్మీదేవేందర్‌యాదవ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సుబ్బయ్య సేవలు మరువలేనివి..: ఎమ్మెల్యే గాంధీ

వెస్ట్ జోన్ బిల్డర్ అసోసియేషన్ ఫౌండర్ ముప్పా సుబ్బయ్య మృతి నిర్మాణ రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కొనుగోలుదారులకు వసతుల పరంగా నాణ్యమైన నిర్మాణాలు అందించిన ఘనత సుబ్బయ్యకు దక్కుతుందన్నారు. సుబ్బయ్య దశదిన కర్మ సందర్భంగా గురువారం మియాపూర్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని సుబ్బయ్య చిత్రపటం వద్ద నివాళుర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

– మియాపూర్

పార్థీ బస్తీ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

పార్థీ బస్తీ పాఠశాలలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, జూలై 18 : పార్థీ బస్తీ అభివృద్ధికి కృషి చేస్తానని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ ఏఈతో కలిసి పార్థీ బస్తీలో పర్యటించి కమ్యూనిటీ హాల్‌లో వసతులు కల్పనపై స్థానికులతో చర్చించారు. కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. కమ్యూనిటీ హాల్‌లో యువత కోసం జిమ్ ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. బస్తీలోని పాఠశాల భవన నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. గణేశ్, జయమ్మ, అంజేశ్, సురేందర్‌నాయుడు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

దుండిగల్,జూలై 18 : అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవోను వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 10ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరింత పెంచాలన్నారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్, వీఆర్ఎస్ తదితర సౌకర్యాలు కల్పించాలని, జీవో నెంబర్ 10ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు దేవదానం, కరుణాకర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

శిబిరంలో పాల్గొన్న ప్రజలు, వైద్య సిబ్బంది

జగద్గిరిగుట్ట, జూలై 18 : పేదలకోసం నిర్వహిస్తున్న హెల్త్‌మేళాను వినియోగించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. జగద్గిరిగుట్ట మఖ్దూంనగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డాక్టర్ శంకర్, నేతలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్‌కు తరలిన కార్మిక ప్రతినిధులు

చలో రాజ్‌భవన్‌లో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రతినిధులు

జగద్గిరిగుట్ట, జూలై 18 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం చేపట్టిన చలో రాజ్‌భవన్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు, అరెస్టులతో ప్రజాఉద్యమాలు అణచలేరని నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాములు, హరినాథ్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తిరుపతినాయుడు

తిరుపతినాయుడికి నియామక పత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

జగద్గిరిగుట్ట, జూలై 18 : మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా చింతల్‌కు చెందిన తిరుపతినాయుడును నియమించారు. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తిరుపతినాయుడికి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎన్ శ్రీనివాస్, సతీశ్, విఘ్నేశ్, బలరాం, భద్రయ్య, విజయ్, సత్తిబాబు, రాజు, గిరిబాబు, కిరణ్‌పాల్ పాల్గొన్నారు.

సత్యనారాయణరాజు నియామకం..

దుండిగల్, జూలై 18 : బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన గొట్టిముక్కల సత్యనారాయణ రాజు(సత్తిబాబు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి గురువారం సత్తిబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఎం.గిరిబాబుని మేడ్చల్ జిల్లా ఇండస్ట్రియల్ సెల్ కన్వీనర్‌గా నియమించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జీ. రమేశ్(ఫైల్)

అల్లాపూర్, జూలై 18: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన జి.రమేశ్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి అల్లాపూర్ డివిజన్ పరిధి శివాజీనగర్‌లో ఉంటూ ఏసీ రిపేర్ వర్క్స్ చేస్తున్నాడు. చాలీచాలని జీతంతో అతడికి కుటుంబపోషణ భారంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు తోడవటంతో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి : జడ్సీ

శేరిలింగంపల్లి సున్నం చెరువులో గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 18 : చెరువులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి సూచించారు. చెరువుల పర్యవేక్షణకు నియామకమైన అధికారులే పూర్తి బాధ్యులని ఎప్పటికపుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. గురువారం జోన్ పరిధిలోని పలు చెరువులను ఎంటమాలజీ అధికారులతో కలిసి జడ్సీ పరిశీలించారు. శనివారం ప్రారంభం కానున్న గోపన్‌పల్లిపై వంతెనను పరిశీలించి గ్రీనరీ, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్సీ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ చెరువుల్లో గుర్రపు డెక్కను ఎప్పటికపుడు తొలగించాలన్నారు. దోమల నిరోధానికి ఎంటమాలజీ సిబ్బంది నీటిలో అయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాలు చెరువుల్లో వేయకుండా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని జడ్సీ అధికారులను ఆదేశించారు. దుర్వాసన రాకుండా కొత్త రకం స్ప్రేలు చేయాలని జడ్సీ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంటమాలజీ, పారిశుద్ధ్య విభాగం అధికారులు ఉన్నారు.

అధికారుల సమన్వయ లోపం.. ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులు

- ఇబ్బందులు పడుతున్న జవహర్‌కాలనీ వాసులు

యూజీడీ పనుల కోసం తవ్విన రోడ్డును అసంపూర్తిగా వదిలేసిన అధికారులు

కొండాపూర్, జూలై 18 : డ్రైనేజీ సమస్య పరిష్కారమైందని సంతోషించాలా..! రోడ్డు సమస్య ఏర్పడిందని బాధపడాలో? తెలియని అయోమయస్థితిలో చందానగర్ డివిజన్‌లో జవహర్‌కాలనీ వాసులు ఉన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు వాటర్ బోర్డు అధికారులు 6 నెలల క్రితం రోడ్డును తవ్వి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. యూజీడీ పనులు పూర్తై నెలలు గడుస్తున్నా.. తవ్విన రోడ్డు పనులను సరి చేయడం మాత్రం మరిచారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను కాలనీవాసులు పలుమార్లు సంప్రదించినప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదు. అసలే తవ్వేసిన రోడ్డు, వర్షాలతో నీరు చేరి బురదమయం కావడంతో స్థానికుల బాధలు వర్ణనాతీతమవుతున్నాయి. వాటర్‌బోర్డు అధికారులను అడిగితే ఇంజనీరింగ్ అధికారులపై, ఇంజనీరింగ్ అధికారులనడిగితే వాటర్‌బోర్డు అధికారుల పనులంటూ తప్పించుకుంటున్నారు. ఇకనైనా రెండు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ కాలనీవాసులు కోరుతున్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

కుత్బుల్లాపూర్, జూలై 18 : కంపెనీల నిర్వాహకులు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కార్మిక సంఘం అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో థర్మో కేబుల్ కంపెనీలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్మికుల పదవీ విరమణ 62 ఏండ్లు పెంచితే థర్మా కేబుల్ యాజమాన్యం 56 ఏండ్లకే వర్తింపజేస్తున్నదని పేర్కొన్నారు. కంపెనీ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కంపెనీ డైరెక్టర్ వర్మ, జీఎం రిషికుమార్, హెచ్ఆర్ మేనేజర్ మనోహర్‌రెడ్డి, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్

- అగ్రస్థానంలో ఏకలవ్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగెట్టా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల నాలుగో రోజు గురువారం అన్ని విభాగాల్లో రెండేసి రౌండ్ల రేసులు నిర్వహించారు. బాలుర ఐఎల్‌సీ-4 విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇదే కేటగిరీలో అక్షత్(మధ్యప్రదేశ్), కృష్ణదివాకర్(మైసూర్) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. మరో వైపు అండర్-16 అప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో తెలంగాణకు చెందిన గోవర్ధన్ టాప్‌లో కొనసాగుతున్నాడు. 8,9 రౌండ్ రేసుల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన గోవర్ధన్ పసిడి పతకం దిశగా దూసుకెళుతున్నాడు. రాష్ట్రానికే చెందిన దీక్షిత 9వ రేసులో 14వ స్థానం నుంచి దూసుకొచ్చి ఆశ్చర్యపరిచింది. అండర్-18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో వైష్ణవి, శ్రవణ్, తనూజ, గణేశ్ జోడీలు తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

బాలానగర్, జూలై 18 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ బండి రమేశ్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన దండు సాయికిరణ్‌తో పాటు పలువురు హరివర్ధన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో కిరణ్, రాయపాటి వెంకటేశ్, అజయ్, కృష్ణ, సురేశ్, అమర్, శ్రీను, శేఖర్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి : కార్పొరేటర్

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

మియాపూర్ , జులై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి కోరారు. నాణ్యమైన విద్యతో ప్రైవేటుకు దీటుగా ఫలితాల్లో మెరవాలని అన్నారు. డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గురువారం బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులు జయరాజు, ఆంజనేయులు, విజయకుమారి, సునీత, ముకుందారెడ్డి, సబిత, సృజనతోపాటు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **B.Anand Kumar** is the owner of H.No. 5-657, Land admeasuring 124 Sq.yds., situated at Izzatnagar Village, Serilingampally Mandal, Ranga Reddy District who acquired the same vide Registered Gift Deed No. 20207/2023, Dated 16-12-2023 from B.Ratnamma.

Whoever has got any claims or rights over the above mentioned property please Contact: J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from Date of publication of this notice.

PUBLIC NOTICE

The General public is hereby informed that my client M/s. Rama wire industries Rep. by its partner Sri Ratik Agarwal S/o. Sri Rajendra Agarwal has entered into an **Agreement of Sale** to purchase all that Plot No.A-20 (APIE Code No.1080F) admeasuring 4,427.42 Sq.Yards, along with building constructed thereon situated at Assisted Private Industrial Estate, Balanagar, Medchal-Malkajgiri District, Telangana, bounded by, **North:** M/s. Veljan Hydrair Pvt. Ltd., **South:** M/s. Sundershila Pvt. Ltd., **East:** M/s. AP Pencil Factory, **West:** Road, from its owners **M/s. TICO MACHINES PRIVATE LIMITED,** Rep. by Prsent Director C. Hemalata W/o. Dr. C. Radha Krishna and Sri C. Sridhar S/o. Sri Dr. C. Radha Krishna. If any person(s) have any claim, right, title or interest over the above said property they shall contact the undersigned with all relevant documents within (7) days from the date of this notice or else my client will proceed to complete the registration of sale deed and thereafter any objection or claim whatsoever in nature shall not be entertained and deemed as waived off.

M/s. Shyam Sunder Agarwal & Sukhraj
Advocate
H.No.12-1-274, Asif Nagar,
Kummarwadi, Hyderabad.
Cell No.9177019888